# On Pantheism

**By William Clarkson అనువాదము : పురుషోత్తము చౌధరి**

## బ్రహ్మజ్ఞానమును గురించినది 1861

మంచి ఫలములు ఫలించే పొలములో కలుపున్ను ముండ్లపొదలున్ను యే ప్రకారము యెదుగుతున్నవో ఆ ప్రకారమే సత్యముతో కూడా నాశన ఫలమనే అసత్యమైన బోధలున్ను అబద్ధమైన మతములున్ను యీ ప్రపంచమనే పొలములో యెదుగుతున్నవి. తెలివిగల మనుష్యుడు మతమును గురించిన్ని, వ్యవహారబోధను గురించిన్ని, ముఖ్యాలోచనను గురించిన్ని పరీక్ష చేసినట్టయితే వాటిలో చాలా తప్పులు కలవని తెలుసుకొనును.

ఈ తప్పులు లెక్కలేనివై నానా విధములుగా వున్నవి. ఇవి సృష్టిని గురించినవిన్ని, సృష్టికర్తను గురించినవిన్ని, అరూపమును గురించినవిన్ని, ఆదిని గురించినవిన్ని, అనాదిని గురించినవిన్ని, శరీరమును గురించినవిన్ని, ఆత్మను గురించినవిన్ని యున్నవి. మరిన్ని ఈ తప్పులు దైవాత్మ మనుష్యాత్మలను గురించినవిన్ని, జననమరణముల గురించినవినిన్ని, సృష్టి కారణ కార్యముల గురించినవిన్ని, మంచి చెడ్డల గురించినవిన్ని, నిత్యనీతులను గురించినవిన్ని, న్యాయాన్యాయములను గురించినవిన్ని, పాపపుణ్యములను గురించినవిన్ని, నాశనరక్షణలను గురించినవిన్నె యున్నవి. ఈ విషయముల యందు మనుష్యుల భావన నానా విధమై యుండుటవల్ల యివి యెంతో హెచ్చియున్నవి.

తప్పులన్నిటికంటే బ్రహ్మజ్ఞాన బోధముఖ్యమైన తప్పైయున్నది. అది యేలాగంటే మనుష్యుని ఆత్మయున్ను దేవుని ఆత్మయున్ను యేకమై యున్నవనిన్ని మనుష్యాత్మకున్ను దేవాత్మకున్ను యెంత మాత్రము భేదము లేదనిన్ని యీ బోధక్రమము వ్రాయబడి యున్నది.

బ్రహ్మజ్ఞాని - మనుష్యుడు మాట్లాడే మాటలు వానివి కావనిన్ని, వానిలో వున్న పరమాత్మయైన దేవుడే మాట్లాడుతున్నాడనిన్ని, చేతులనున్ను కాళ్లనున్ను చలింపచేసేవాడు మనుష్యుడు కాదనిన్ని, వాటిని చలింపచేసే వాడు దేవుడే అనిన్ని చెప్పును. మరిన్ని సకలాపేక్షలు పుట్టించేటందుకు ఆయనే మూలమై యున్నట్టున్ను మనుష్యుడు అబద్ధములాడినా వాని నోటినుంచి దేవుడే వాటిని పలికిస్తూ వున్నట్టున్ను, వాని కాళ్ళు చెడ్డవి చేయుటకు పరుగెత్తినప్పుడు వాటిని దేవుడే నడిపిస్తూ వున్నట్టున్ను, ప్రపంచములో జరిగే యావత్తుకున్ను ఆ వొక్కడే కార్యకర్తయై యున్నట్టున్ను యీ బ్రహ్మజ్ఞానము బోధిస్తున్నది.

ఇటువంటి బోధ అవివేకులకు మిక్కిలీ ఆశ్చర్యముగా వుండును. అయితే యీ జ్ఞానము మేము పరీక్షించినప్పుడు అది మాకు కేవలము అజ్ఞానముగా కనబడును.

చదివేవాడా నీ బుద్ధి అనే గీటురాతి మీద యీ బోధ చేర్చుము. నేను చూపే తర్కములను బాగా ఆలోచించుము.

### 1. ఈ బోధ అబద్ధమనిన్ని వొప్పతగనిదనిన్ని చూపుదును

- నేను మొదట స్థాపించేదేమంటే - సకల మనుష్యులలో పెద్దలైనా, పిన్నలైనా, విద్వాంసులైనా, మూర్ఖులైనా తాము వొకనికివొకడు వేరువేరుగా వున్నామనిన్ని, దేవునికి వేరుగా వున్నామనిన్ని తెలియతగిన స్వభావము వారికి వున్నది. ప్రతిమనుషయడున్ను తన శరీరవిషయమై మాత్రము కాదు ఆత్మ విషయమైయిన్ని యితరులకందరికీ తాను వేరుగా వున్న వొకడనిన్ని తెలుసును. ఇది సమస్తమనుష్యులకు సాధారణస్వభావమై యున్నది. నేనున్ను, నీవున్ను, నాదిన్ని, నీదిన్ని అనే జ్ఞానము అందరికిన్ని కలదు. నిశ్చయముగా దీని వొప్పుకొనని వాడు వొకడైనా లేడు. అందరున్ను యీలాగునే పలుకుతున్నారు.

అయితే బ్రహ్మజ్ఞానము నిశ్చయమైయుంటే మనుష్యులంద రున్ను మోసపోయి యున్నారు. యేమంటే వారి స్వభావికపు తెలివి వారి విషయమై అబద్ధమాడుతున్నది. అందుకు యీ బోధను అనుసరించేవారు నిజమే – మనుష్యులందరూ మోసపోయి యున్నారు. వారు వొక్కొకడు వొక్కొక ఆత్మయై యున్నామని యెంచుకొనుటవల్ల తప్పిపోయినారని చెప్పుదురు. ఇందుకు మేము ముఖ్యమైన దృష్టాంతము చెప్పుతాము. అది యేమంటే – దేవునికిన్ని మనుష్యులందరి ఆత్మలకున్ను భేదము యేమిన్ని లేకుంటే మనుష్యులు మోసపోయిరి, దేవుడున్ను మోసపోయెనని తెలియవలెను. అయితే దేవుడు మోసపోయెనని మేము వొప్పగలమా – కూడదు. ఇది నాస్తికాభిప్రాయము.

అయితే నాస్తికాభిప్రాయమును తప్పించుకొనుటకు ఆలాగు కాదు దేవుడు మోసపోలేదని బ్రహ్మజ్ఞాని చెప్పినట్టయితే అందుకు మేము, దేవుడు మోసపోకుంటే అప్పుడు మనుష్యులు మోసపోయిరని మేమనుట అడ్డుమాట గదా – దేవుడు మోసపోకుండా మనుష్యులు మాత్రమే మోసపోయినట్టయితే అప్పుడు మనుష్యుడున్ను దేవుడున్ను వేరుగా వున్నారని స్థాపించబడవలసినది గనుక యీ బోధ అబద్ధమాయెను.

ఇప్పుడు మోసపోయిన వారిని గురించి విచారణ చేతుము. అయితే మోసము చేసినవాడు యెవడు. దేవుడు మోసపోయెనని నాస్తికుల వలె మీరు చెప్పితే ఆయనను యెవరు మోసపరిచిరని అడుగుదుము. అందుకు ప్రత్యుత్తరము యివ్వలేదు. అయితే మనుష్యులు మాత్రమే మోసపోయిరని మీరు చెప్పితే వారిని మోసపరిచినవాడు యెవడని చెప్పవలెను. అతడు దేవుడే అని మీరు చెప్పినట్టయితే అప్పుడు దేవుడు వేరు అనిన్ని మనుష్యులు వేరు అనిన్ని స్థాపించబడుట యెందుకు. కాబట్టి మోసపోయిన వారున్ను మోసపరిచిన వాడున్ను వేరై యున్నారనుటకు యే సందేహమున్ను లేదు గనుక ఈ భోధ అబద్ధమాయెను.

– ఇప్పుడు మేము రెండవ తర్కము తెస్తాము – మనుష్యులందరూ తప్పిపోయిరనిన్ని యీ బోధ సత్యమైనదనిన్ని మేము వొప్పినట్టయితే అప్పుడు యీ సత్యబోధ తెలియతగిన వారు యెవరు. దేవుడే అని గదా పుత్తరమివ్వవలెను. అయితే దేవుడు దాని యెవరికి తెలిపెను. మనుష్యుల ఆత్మలకా – కాదు యెందుకంటే తనకున్ను వాటికిన్ని భేదము యేమిన్ని లేదు. మరి యెవరికి తెలిపెను. తనకా – అవును తనకే అని చెప్పవలెను. అలాగైతే తనకు తానే తెలియచేసుకొనుటకు ఆవశ్యమై యుంటే దేవుడు యీ బోధ తెలియక యింత అజ్ఞానియై యున్నాడా అని అడుగుతున్నాము. దేవునికి యీ బోధ తెలిసి యుంటే మనుష్యులకున్ను తెలిసును గనుక మరి వారికి తెలియచేయుటకు హేతువు యేమిన్ని లేదు. దేవునికి తెలుసునే గాని మనుష్యులకు తెలియదని మీరు చెప్పితే అప్పుడు దేవునికిన్ని మనుష్యునకున్ను భేదము స్థాపించితిరి. మరిన్ని యీ బోధ దేవునికి తెలియదంటే అప్పుడు ఆయన జ్ఞానహీనుడై యున్నాడు. అయితే యిదిన్ని నాస్తికాభిప్రాయమే.

– ఇప్పుడు మేము మూడవ తర్కము తెస్తాము. ఈ భోద నిశ్చయ మైనదైతే దాని గురించి కొన్ని తర్కములు యెందుకువున్నవి. బ్రహ్మజ్ఞాని గాక మనుష్యులందరూ దేవునికిన్ని మాకున్ను భేదమున్నదని చెప్పుతున్నారు. అందుకు బ్రహ్మజ్ఞాని ఆలాగు కాదు దేవుడున్ను మనమున్ను వొక్కటే. మనకున్ను దేవునికిన్ని భేదమేమిన్ని లేదు. మరిన్ని మన యందరిలో ప్రతివానికిన్ని వొక్కొక ఆత్మ కలదనే బుద్ధి విడిచిపెట్టవలెనని వారితో పలుకుతున్నాడు.

మరిన్ని బ్రహ్మజ్ఞానులు దృష్టాంతములను చూపి మిక్కిలీ తర్కము చేసి యీ బోధ నిజమని అందరున్ను వొప్పుకొని దాని అంగీకరించే కొరకు నానా విధములుగా ప్రయాసపడుతున్నారు.

అయితే వారికి యెదిరించి తర్కించేవారు ఆ బోధ నిజమని వొప్పుకొనలేరు. అదిగాక యీ బోధచేత వారిని సమ్మతి పరుచుట మిక్కిలి కష్టమైనది.

కాబట్టి యీ యుభయుల అభిప్రాయముయొక్క యెక్కువ తక్కువలు యెందుకు - యీ తర్కము యెందుకు వారిని తమ పక్షముగా సమ్మతిపరుచుటకు యీ ప్రయత్నము యెందుకు - వీరు యీ పక్షముగా సమ్మతించుటకు వొప్పని మనస్సు యెందుకు అని మేము అడుగుతున్నాము.

ఈ బోధప్రకారము విచారిస్తే మనుష్యుల ఆత్మలు వేరుగాకుండా పరమాత్మ వొక్కడే, మరి యెవడున్ను లేడు. ఆలాగైతే పరమాత్ముడు తనకు తానే వేరే అభిప్రాయములు గలవాడై యుండునా - తనకుతానే యెదిరించునా - తన్ను తానే సమ్మతిపరుచుకొనుటకు వెతుకునా - తనకు తానే దృష్టాంతములు అగుపరుచుకొనునా - మరిన్ని యెన్ని దృష్టాంతములు యిచ్చినప్పటికీ అంగీకరించక వుండునా. ఈయన యేలాటి దేవుడు. ఇది యెటువంటి దేవత్వము. ఈ జ్ఞానము నాస్తికాభిప్రాయమునకు చేరి యుండలేదా, విచారించండి.

- ఇప్పుడు మేము నాలుగో తర్కము తెస్తాము - ఈ బోధ నిజమైనదైతే ఆత్మతాను చేసిన పనికి మనస్తాపపడుటయున్ను, తీవ్రవేదనలకు సహించకపోవుటయున్ను, దాని స్వంతపు యోచన లవల్ల భయపడుటయున్ను యెందుకు? తనకు తానే శిక్ష విధించుకొనుటయున్ను, రాబోయే దండనకు భయపడుటయున్ను యెందుకు? మనుష్యుల ఆత్మలున్ను దేవుని ఆత్మయున్ను యేకమై యుంటే అప్పుడు దేవుడు తనకు తానే వ్యధపరుచుకొంటున్నాడనిన్ని, తనకు తానే భయపెట్టు కొంటున్నాడనిన్ని, తన్ను తానే కష్టపెట్టు కొంటున్నాడనిన్ని తలంచవలనెను గదా - అయితే దేవుడు యీలాటి వాడై యున్నాడా, లేదు. ఈలాటి దృష్టాంతములవల్ల యీ బోధ మిక్కిలీ అబద్ధముగా కనుపిస్తున్నది.

దేవాత్మకున్ను మనుష్యాత్మకున్ను భేదము లేదని చెప్పే యీ బోధను గూర్చిమేము ఆలోచించి చూచినప్పుడు దేవుడు మోసపోయి యున్నాడు. మోసము చేస్తున్నాడు. మూఢుడైయుండి తనకుతానే బోధించు కొంటున్నాడు. తన్ను తానే సమ్మతి పరుచుకొనుటకు యత్నము చేస్తున్నాడు.

అయితే సమ్మతిపడడు. తనలో తానే పోరాడుతున్నాడు. తనలో తానే యెదిరిస్తున్నాడు. ఇంతే కాకుండా తనకు తానే నానావిధమైన మనో యాతనలవల్ల దుఖఃమున్ను వేదనయున్ను కలుగచేసుకొంటున్నాడని తెలియబడుతున్నది. ఇందువల్ల దేవుని గురించియిటువంటి అబద్ధమైన తలంపులను పుట్టించే యీ బోధకేవలము అబద్ధమని యీ నాలుగు తర్కములవల్ల చూపించితిమి. ఇప్పుడు బ్రహ్మాజ్ఞానము అబద్ధమునిన్ని దాని అంగీకరించ కూడదనిన్ని నిశ్చయించబడెను.

మరిన్ని బ్రహ్మాజ్ఞానులు తమ స్వకీయమైన జ్ఞానబోధను తామే నమ్మక వున్నారు వారు తమ బోధచొప్పున ప్రవర్తించలేదు. ప్రవర్తించుననున్ను వల్లకాదు. ఇందుకు దృష్టాంతమేమంటే దేవుడున్ను, మేమున్ను వొకటే, నేను అనేదిన్ని లేదు నీవు అనేదిన్ని లేదు – ఏకమేవాద్వితీయము అనుటను పరమాత్మ వొకడే అని వారు బహుబలముగా చెప్పుతున్నారు. అయితే లౌకికిమైన పనుల యెడల వీరి ప్రవర్తన మేము పరీక్షించినట్టయితే యితరులవలె నీవు, నేను, నాది, నీది అని వారు చెప్పే మాటలు మాత్రము కాకుండా సాధారణమై భేదభావముల యందు వారు సమ్మతించి యున్నట్టు వారి ప్రవర్తనలవల్ల కనిపిస్తున్నది.

ఒక బ్రహ్మాజ్ఞానియైన సాహుకారుకు లక్ష రూపాయల అప్పు తీర్చవలసిన వొక ఋణస్థుడు వుంటే అప్పు యిచ్చిన వాడున్ను అప్పు తీర్చేవాడున్ను వొకడే గదా అనే తెలివివల్ల ఆ సాహుకారు ఆ ఋణస్థుని యెడల క్షమించి తీర్చ తగినసొమ్ము విడిచి పెట్టునా – లేదు, సర్కారులో ఫిర్యాదుచేసి వాని శ్రమపెట్టి తన చేతనైనంత మట్టుకు ఆ సొమ్ము రాబట్టుకొనుటకు ప్రయత్నము చేసును.

మరిన్ని వొక బ్రహ్మాజ్ఞానియొక్క ఆస్తిలో వొక రాయి మాత్రము వొకడు దొంగిలినట్టయితే, తన ఆత్మయున్ను, ఆ దొంగయొక్క ఆత్మయున్ను వొకటేగదా అని ఆ బ్రహ్మాజ్ఞాని తన బోధప్రకారము నడిచి తన పోయిన

ఆస్తిని తిరిగీ సంపాదించుటకు యత్నము చేయక దొంగను విడిచి పెట్టునా - లేదు. అతడు వాని పట్టుకొని న్యాయాధిపతి యొద్దికి తీసుకొని వెళ్లి వానిమీద నేరము మోపును.

మరిన్ని యెవడైనా వొక బ్రహ్మజ్ఞానిని నిందించి, బలవంతముగా కొట్టినట్టయితే, వాడు తన్ను కొట్టిన వానికిన్ని, తనకున్ను వొక్కటే అత్మయనిన్ని, తమకిద్దరికిన్ని, దేవునికిన్ని వొకటే ఆత్మయనిన్ని, అనుకొని అ కొట్టినవాడు శత్రువుకాదని భావించునా - లేదు. వాడు తనకు శత్రువని యెంచి వాని యెడల ద్వేషించి పగ తీర్చుకొన వెతుకును.

ఈ విధముగా బ్రహ్మజ్ఞాని తన బోధవల్ల, దేవుడు వొకడే గాక మరి యొక కార్యకర్త లేడని చెప్పును అయితే యితరులు కార్యకర్తలై యున్నట్టు తన క్రియలవల్ల తెలిపి తన్ను బాధపరిచిన వారిని తానున్ను బాధ పరుచుటకు వెతుకుతున్నాడు.

దేవుడే గాక మరియొక కార్యకర్తలేడని తాను నిజముగా నమ్మితే, తన్ను బాధపరిచిన వానికి తానున్ను, యీడుకు యీడు యెందుకు యిచ్చును. ఈలాగు దేవునితో యెందుకు కలహించును.

ఇదిగాక బ్రాహ్మణులు తమ స్వకీయజ్ఞానబోధను నమ్మినవారై యుంటే, వారు జాతి భేదములను యెంచుట యెందుకు. కీడుకంటే మేలున్ను, ఆశుచికంటే శుచిన్ని, మంచివని చెప్పుట యెందుకు. వారు ఆత్మలన్నీ వొకటే అని చెప్పుతున్నారు గదా - యీ భేదములు యెందుకు.

ఈ కారణములు చూచినప్పుడు బ్రహ్మజ్ఞానులు తమ సమస్త ప్రవర్తనలవల్ల తమ బోధ నమ్మలేదు - నమ్మనున్ను కూడదని తేటపడి యున్నది. యెందుకంటే దేవుడు ప్రతి మనుష్యునిలో ఆ బోధ అబద్ధమని తలంచుటకు బలమైన తెలివి వుంచి యున్నాడు. ఈ తెలివి వానిని యెప్పటికిన్ని విడిచిపోదు.

ఈ బోధను వెంబడించే వారిని మేము యెవరికి సాటి చేతుమో - వారు నాట్యశాలలో రాజవేషము ధరించి రాజాధికారము తెచ్చుకొని అట్టహాసము చేసి మిక్కిలీ టెక్కుగా నడిచి ఆట తీరిన తరువాత వేషము విడిచి చింకి గుడ్డలతో తమ ఆహారమును అడుగుకొనే ఆటకాండ్లవలె వున్నారు.

మరిన్ని వీరు ఆడుకొనే చిన్నవారిని పోలియున్నారు. యేలాగంటే ఆ చిన్న వారిలో వొకడు పండితుని వలెనున్ను, మరియొకడు తండ్రివలెనున్ను, మరియొకడు న్యాయాధిపతి వలెనున్ను వేషములు దరించుకొని ఆయా అధికారముల యందు వొక్కొకడు తన పరాక్రమము యిట్టిదని చెప్పుకొంటూ వున్న సమయమందున, బెత్తము చేతపట్టుకొని వచ్చే వుపాధ్యాయునైనా, తండ్రినైనా వారు చూచేటప్పుడు వారు తమ అధికారములు విడిచి తమ చెరుపు మాటలున్ను గర్వమున్ను నిలిపివేసి సిగ్గుపడి తొలిగిపోదురు.

ఈ ప్రకారమే బ్రహ్మజ్ఞానులు దేవుడున్ను, తామున్ను వొక్కటిగా వారిలో అని అహంకరించి బడాయిగా మాతో పలుకుదురు. ప్రతివాడున్ను, దేవుడు నాతో మాట్లాడుతున్నాడు, నేనే దేవుడనని పలుకుతున్నాడు. అయితే వారు యీ మాటలవల్ల వ్యర్థమైన మాట్లాడే బడాయికాండ్ల వలె కనుపింతురే గాని మరి యేమిన్నీ లేదు. రవంత కష్టమైనా, రవంత వుపద్రవమైనా వారికి సంభవించినట్టయితే వారిఆట కడతేరును. అప్పుడు వారందరూ దేవునికిన్ని, తమకున్ను భేదమున్నదని చెప్పుదురు. ఇకను మహిమగల నిత్యాత్మతో తమ్మును వొక నిమిషమున్ను సమానముగా చేసుకొనరు.

శరీరమునుంచి చర్మము వేరు చేసుట సుళువై యుండు ను. అయితే తనకున్ను, పరమాత్మకున్ను ప్రత్యేకత్వమున్నదనే తెలివి ఆత్మలోనుంచి తీసివేసేవాడు యెవడు.

2. ఈ జ్ఞానబోధయొక్క బుద్ధిహీనత మేము చూపుదుము.

స్వభావము చేత యే వస్తువుయొక్క గుణములు వేరై యుండునో, వాటి జాతియున్ను వేరు.

చూడండి - వొక ముళ్లచెట్టున ముళ్ల ఫలములు పుట్టును. మామిడి చెట్టున మామిడిపండ్లు పుట్టును. వీటిలో జాతివొకటి కాదు. రెండు జాతులై యున్నవి. మరిన్ని వొక వూటనుంచి తియ్యని నీరున్ను మరియెక దానినుంచి వుప్పునీరున్ను వచ్చినట్టయితే వీటి జాతి వొకటి కాదు, రెండు జాతులై యున్నవి. ఈ జాతులను వొకటే అని చెప్పడము బుద్ధిహీనత. ఈలాగే మనుష్యాత్మ లక్షణములు కొన్ని యున్నవి - దేవాత్మ లక్షణములున్ను కొన్ని యున్నవి. ఇవి వొక దానికి వొకటి చాలా యెక్కువ తక్కువలై యున్నవి. ఇందుచేత మనుష్యాత్మయున్ను, పరమాత్మయున్ను వొక విధము కాకూడనందున వీటిని కలపడము బుద్ధి హీనత.

మరిన్ని వొక్క జాతిగా వున్న ప్రతిదానిన్ని, తన స్వకీయ గుణము వాటిలో వొక్కొక వస్తువుకు వొక్కొక గుణము కలదు. వొక మామిడి చెట్టున పెద్ద పండ్లున్ను, మరియొక చెట్టున చిన్న పండ్లున్ను పుట్టును. అవి యేక జాతి వైనప్పటికిన్ని వాటి గుణములు రెండు విధములై యున్నవి.

ఈలాగే వొక్క మనుష్యుని ఆత్మ వొక విధముగానున్ను, మరియొకని ఆత్మ వేరే విధముగానున్ను వున్నది. వారు వొక్క విధముగా వుండక రెండు విధములైయున్నారు. మరిన్ని పరమాత్మకున్ను మనుష్యాత్మకున్ను జాతియందు యే ప్రకారముగా భేదముండునో ఆ ప్రకారమే మనుష్యులలో ప్రతివాడున్ను ఆలాటిగుణములు గలవాడైయున్నాడు. ప్రతివానికిన్ని తన తన గుణములు వేరుగా వున్నవి. మనుష్యులలో యెన్ని విధములుగా ముఖరూపములు వున్నవో అన్ని విధములుగా గుణములున్ను వున్నవి. వీని ఆత్మకున్ను, వాని ఆత్మకున్ను భేదమున్నది. ఇటువంటి భేదములు గల ఆత్మలన్నీ యేకమని చెప్పుటయున్ను, వాటిని వేరు చేయక

వుండుటయున్ను మిక్కిలీ బుద్ధిహీనత. నానా విధములైన వస్తువులను వొక్క జాతియందే కూర్చుట మిక్కిలీ అవివేకము. బ్రాహ్మణుల బోధ యీలాటి అవివేకము గలదై యున్నది దీని తేటగా చూపించుటకు పరమాత్మయొక్క లక్షణములనున్ను, మనుష్యాత్మయొక్క లక్షణములనున్ను క్రమముగా పరీక్షించి వాటికిన్ని వీటికిన్ని సరిచూడవలెను.

## (అ). స్వభావ లక్షణములు

పరమాత్ముడు తనకు తానే స్వతంత్రుడైయున్నాడు. ఆయన యెవరికిన్ని అధీనుడై యుండలేదు. యెవరి అధికారములోనున్ను వుండలేదు. యెవరి సేవకుడున్ను కాడు. తన చిత్తమందున్ను, తన ఆజ్ఞల యందున్ను సర్వస్వతంత్రుడై యున్నాడు.

మన మనస్సాక్షియొక్క తెలివి ప్రకారము మనుష్యాత్మ దేవాత్మకు స్వాధీనమై యున్నది. ఆయన చిత్తము చొప్పున నడుస్తున్నది. ఆయన అధికారము కింద నిలిచి యున్నది.

అతనికి సముద్ర తీరమందున్న యిసుక రేణువుల యొక్కయున్ను, అడవి చెట్ల ఆకులయొక్క యున్ను, ఆకాశ పక్షుల యొక్కయున్ను, సముద్రపు మత్స్యములయొక్కయున్ను సంఖ్య తెలియదు. అతడే అనేక విషయములయొక్క గుణములను యెరిగినప్పటికిన్ని యేవిషయముయొక్క గుణములను యెరిగినప్పటికిన్ని యేవిషయముయొక్క సారమునున్ను యెరుగడు. సర్వలోకమందు నడిచేది యావత్తున్ను, దాని మార్గమున్ను, దాని తాత్పర్యమున్ను చెప్పేటందుకు అతని చేత కాదు. వుత్తమోత్తమ జ్ఞానము గలవాడైనప్పటికిన్ని మనుష్యునికి.యీలాటి తెలివిలేదు.

ఇదిన్ని గాక పరమాత్మకు అపరిమితమైన శక్తివున్నది. దాని వల్లనే సృష్టిన్ని నాశనమున్ను కలుగుతున్నవి. అదే చంపుతున్నది – బ్రతికిస్తున్నది, అదే వుద్ధరిస్తున్నది – చెరుపుతున్నది. తన మనస్సుకు వచ్చినదంతా చేయగలదు. దానికి యే ఆటంకమైనా కలుగనేరదు.

మనుష్యాత్మయేమి చేయగలదు? - యేమిన్ని చేయలేదు. అది తన యిచ్ఛవల్ల చెయ్యి, కాలు ఆడిస్తున్నది - యింతకంటే యెక్కువ చేయనేరదు. అనేక పర్యాయములు దానికి బలమైన అపేక్షలు పుట్టును. అయితే వాటిని తీర్చుకొననేరదు. అనేక పర్యాయములు అది యోచనలను చేసును. అయితే వాటిని జరిగించుటకు కలిగే అడ్డములను తప్పించుకొనుటకు దానికి సామర్థ్యము లేదు. అది వొక వస్తువుయొక్క లేశమాత్రమైనా సృష్టించలేదు. లేశమాత్రమైనా నశింపచేయలేదు. అది ప్రాణము యివ్వలేదు తన యిచ్ఛవల్ల దాని తీసివేయలేదు. అది తనకు కావలసినది చేసుకొనలేదు. అయితే తనకు కూడని దాని అనుభవించుటకు యత్నపడుతున్నది. ఈ ప్రకారము మనుష్యాత్మ బలహీనమై యున్నదిగదా. సర్వశక్తిగల పరమాత్మతో దానిని సమానము చేయవచ్చునా.

(ఆ)ఇప్పుడు మేము పరమాత్మయొక్కయున్ను, మనుష్యాత్మ యొక్కయున్ను, నీతి లక్షణములను పరీక్షింతుము.

పరమాత్మ సద్గుణములు గలదిన్ని మనుష్యాత్మ దుర్గుణములు గలదిన్నె యున్నది. పరమాత్మ న్యాయము గలదై తీర్పులను న్యాయముగా చేస్తున్నది. అందరికిన్ని న్యాయమైనది యిస్తున్నది. యెవరికైనా మొగమోటమి చూపకుండా సమస్త క్రియలను వొక్కత్రాసు యందే తూనికె చేస్తున్నది. పక్షపాతము దానికి దూరమై యున్నది.

మనుష్యాత్మ తన న్యాయపు తీర్పుల యందున్ను, ఆజ్ఞలయందున్ను పక్షపాతముగలదై యున్నది. అది ముఖ్యముగా తన యెడల పక్షపాతముగా తీర్పులను చేసుకొంటూ తాను అపేక్షించే ప్రకారముగా నున్ను, తనకు ఆదాయమయే ప్రకారముగానున్ను నిర్ణయించుకొంటున్నది. అది తన సుగుణములను గొప్పవిగానున్ను, తన దుర్గుణములను కొద్దివిగానున్ను యెంచుకొంటున్నది. మరిన్ని యితరుల దుర్గుణములను హెచ్చించి వారి సుగుణములను తక్కువగా చెప్పుతున్నది.

మరిన్ని పరమాత్మ దయగలదై యున్నది. అది తాను సృష్టించిన వాటికి సౌఖ్యమున్ను, మేలున్ను వుండుటకు కోరుతున్నది. అసూయపడదు – పగ యావత్తున్ను దాని స్వభావమునకు అతిదూరమై యున్నది. అది యెల్లప్పుడున్ను వుపకారములు చేసుట యందున్ను అందరికీ సౌఖ్యము యిచ్చుట యందున్ను యత్న పడుతున్నది.

మనుష్యాత్మయొక్క గుణము ఆలాటిది కాదు. మిక్కిలీ అసూయ బడుతూ నానా విధములుగా కీడు చేస్తున్నది. పశు మృగాదుల యందు క్రూరత్వము జరిగిస్తున్నది. మనుష్యులను బాధపెట్టుతున్నది. దాని పగ, మత్సరము మొదలైన వాటి ఫలములనున్ను, దాని క్రూర కార్యములనున్ను యెవరు చెప్పగలరు.

మరిన్ని పరమాత్మకు పూర్ణపరిశుద్ధత కలదు. చెడ్డది దాని స్వభావము నకు దూరమై యున్నది. దేవుని పరిశుద్ధతకున్ను, పాప గుణములకున్ను మిక్కిలీ విరోధము వున్నది.

మనుష్యాత్మకు పాపము చేసుట యిష్టము. అది నీతి క్రియల విషయమై మిక్కిలీ తక్కువగా వున్నది. అన్యాయము వల్లనున్ను, అపరాధము వల్లనున్ను బహుభారముగలదై పాపముతో నిండి యున్నది.

ఈలాటి దృష్టాంతములవల్ల దేవాత్మకున్ను, మనుష్యాత్మకున్ను విస్తారమైన భేదములు వున్నవని మాకు తెలుసును. ఆ భేదములన్నిటిలో యిది గొప్పదని మేము చెప్పవలెను.

ఇతర విషయముల యందు ఐక్యతయున్ను, పోలికెయున్ను వుండ వచ్చును. అయితే యీ రెండు ఆత్మలయందున్న వ్యత్యాసము యింత అధికమై యుండుటవల్ల వాటిని వొక దానితో వొకటి పోల్చకూడదు. అవి యేకమై యుండుట అసాధ్యము.

మేము యీ వ్యత్యాసమును యే దృష్టాంతము వల్ల చూపవచ్చును. వెలుగుకున్ను, చీకటికిన్ని యెంత వ్యత్యాసమున్నదో

పరమాత్మకున్ను, మనుష్యాత్మకున్ను వున్న వ్యత్యాసము అంతకంటే చాలా అధికమై యున్నది. ఆకాశము భూమికంటే వున్నతమై యున్నట్టు, దేవాత్మ మనుష్యాత్మకంటే అత్యధికమై యున్నది. ఈ వ్యత్యాసము చూపుటకు సర్వలోకమందున్న యే వస్తువైనా కావలసినంత దృష్టాంతము మాకు యివ్వనేరదు. యెందుకంటే సృష్టియొక్క వస్తువులకు వున్నభేదము మితమై యున్నది. అయితే సృష్టికర్తకున్ను, సృష్టించబడిన వాటికిన్ని వున్న బేధము అపరిమితమై యున్నది.

అయినప్పటికీ బ్రహ్మజ్ఞాని - దేవుని ఆత్మ నాలో వున్నది. నేను దేవుడను - అని చెప్పుతున్నాడు. యీలాటి బుద్ధిహీనత, యావద్బుద్ధి హీనతకంటే యెక్కువై యున్నది. ఈలాటి వారితో మేము యేమనగలము. వారి వెర్రితనము యేలాగు పరిహరించ వచ్చును.

ఒక దొంగను పట్టి, న్యాయాధిపతి యొద్దికి తీసుకొని వెళ్లినప్పుడు, న్యాయాధిపతి యొక్క ఆత్మ నాలో వున్నదనియైనా లేక నా ఆత్మయున్ను, న్యాయాధిపతి ఆత్మయున్ను యేకమై యున్నదనియైనా చెప్పితే, వాడు బుద్ధిమంతుడని యెంచబడునా లేక వెర్రివాడని యెంచబడునా? మరిన్ని అప్పు పుచ్చుకొనిన వొకడు తాను తీర్చవలసిన అప్పును గూర్చి క్షమించబడే కొరకు నా ఆత్మయున్ను, అప్పు ఇచ్చిన వాని ఆత్మ యున్ను వొకటే, నాకున్ను, అతనికిన్ని భేదము లేదంటే వాడు బుద్ధిమంతుడని యెంచబడునా లేక బుద్ధిహీనుడని యెంచబడునా. బేధము గల వాటిని వొకటిగా యెంచుటయున్ను వేరై యున్న వాటిని కలుపుటయున్ను మిక్కిలీ బుద్ధిహీనత గనుక తమకు తామే వుత్తమోత్తమమైన బుద్ధిమంతులమని యెంచుకొని, తమ జ్ఞానము దేవుని జ్ఞానమే అని బలముగా చెప్పి, వారు యింత బుద్ధిహీనత ఆగుపరుస్తున్నారు. అయ్యో, అయ్యో, బైబిల్ అనే వేదమందు వ్రాసి యున్నటువంటి వాక్యము వారి విషయమై నిశ్చయించబడి యున్నది. అది యేదంటే తాము జ్ఞానులమని అనుకొని వెర్రివారైరి. ఈ లోకపు జ్ఞానము దేవుని యెదుట వెర్రితనమై యున్నది.

3. ఇప్పుడు మేము యీ జ్ఞానబోధయొక్క దుర్గుణములను అగుపర్చ బోతున్నాము.

మా స్వస్థలముయొక్క హద్దు మీరక యుండుటయున్ను, పరుల వస్తువులు అపేక్షించక వుండుట యున్ను నీతిసారమై యున్నది. మర్యాద జరిగించని వానికి నీతి యెక్కడ వున్నది. తండ్రికి తగిన మర్యాద కుమారుడు జరిగించవలెను, పెనిమిటికి తగిన మర్యాద భార్య జరిగించ వలెను, రాజుకు తగిన మర్యాద ప్రజలు జరిగించ వలెను. ఈ విధమైన మర్యాదలను జరిగించని వారు నీతిని చెరుపుతున్నారు. చెరుపుట వల్ల మనుష్యులలో మిక్కిలీ అసమాధానమున్ను, అసౌఖ్యమున్ను, జగడమున్ను పుట్టును. కాబట్టి సృష్టించబడిన మనుష్యుడు తన సృష్టికర్తకు తగిన మర్యాద జరిగించ కూడదా. ఈలాటి సంబంధము గలవారందిరిలో మర్యాదలను జరిగిస్తే, మనుష్యాత్మకున్ను దేవాత్మకున్ను వున్న గొప్ప సంబంధమందు మర్యాద జరిగించ వద్దా - అని మేము అడుగుతున్నాము.

అయితే యీ బ్రహ్మజ్ఞానులు మర్యాద చెరుపుతున్నారు. వారు తమ్మున్ను తమ ఘనమైన సృష్టికర్తనున్ను వొకటే చేసుకొని నేనే సృష్టికర్తను, సృష్టికర్తను నేనే అని చెప్పుతున్నారు. కుమారుడు తండ్రికి తగిన మర్యాద మరిచి నేనే తండ్రినని న్ని వొక దాసుడు యజమానునికి తగిన మర్యాద మరచి నేనే యజమానుడనని న్ని ప్రజలలో ప్రతివాడున్ను రాజుకు తగిన మర్యాద మరిచి నేనే రాజునని న్ని చెప్పిన ప్రకారమే యిది వుండును. అయ్యో! యిది అంతా న్యాయమునకున్ను, క్రమమునకున్ను, అధికారము నకున్ను యెంతో విరోధమై యున్నది.

(అ)దీని యందున్న గర్వము బడాయి అహంకారము మొదలైనవి యేలాటివో చూడండి.

నేనే సృష్టికర్తనున్ను వొకటే చేసుకొని అల్పుడైన మనుష్యుడు మహోన్నతమైన వానితో తన్ను సమానము చేసుకొంటున్నాడు. తాను

జీవించుటకు తన తల్లి గర్భమందు పుట్టుటయే తనకు ఆది. అట్టివాడు అనాదియైన దేవునితో తన్ను సమానము చేసుకొంటున్నాడు. మూఢుడున్ను, బలహీనుడున్ను, మార్చబడతగిన వాడున్నయిన మనుష్యుడు, అపరిమితమైన బుద్ధి పరాక్రమము, అచంచలత్వము మొదలైనవి గల దేవునితో తన్ను సమానము చేసుకొంటున్నాడు.

ఒక యిసుక రేణువు జ్యోతి స్వరూపుడైన సూర్యునితో తన్ను సమానము చేసుకొంటే, దానికి తప్పు వున్నప్పటికిన్ని పోల్చుటకు ప్రమాణము కలదు. యెందుకంటే ఆ రెండున్ను సృష్టించబడినవై యున్నవి. పెంటమీద కూర్చున్న వొక భిక్షకుడు తాను పరాక్రమము గల విక్రమాదిత్యుడనని చెప్పుకొంటే తప్పు అయినప్పటికిన్ని, పోల్చుటకు ప్రమాణము కలదు. యెందుకంటే వారిద్దరు సృష్టించబడిన మనుష్యులైయున్నారు. అయితే మనుష్యులు తమ్ము‌ను మహిమగల సృష్టికర్తతో సమానము చేసుకొన్నప్పుడు మిక్కిలీ అధికముగా తప్పు చేస్తున్నారు. యెందుకంటే యీలాగు పోల్చుటకు ప్రమాణము లేదు. సృష్టికర్తకున్ను, ఆయన సృష్టించిన యావత్తుకున్ను చెప్పరాని వ్యత్యాసము నిరంతరమున్ను వుండ వలెను. కాబట్టి యీ బ్రహ్మజ్ఞానుల గర్వము చూడండి, దీనికంటే యెక్కువైన గర్వము యెక్కడనైనా వుండదు. యింత అహంకారము యెక్కడ కలదు?

(ఆ)దీని యందు యెంత కృతఘ్నత వున్నదో చూడండి.

ఆత్మలన్నీ దేవుని వల్ల నిర్మించబడినవి. అవన్నీ ఆయన వల్ల వుద్ధరించబడి యున్నవి. అవి అయినవల్ల శక్తిన్ని తెలివిన్ని పొందుతున్నవి. నివాసము చేయతగిన బస యిల్లుగా ఆత్మకొరకు యివ్వబడిన శరీరము కూడా దేవునివల్ల కాపాడబడుతున్నది. గనుక ప్రతి మనుష్యుని ఆత్మయున్ను తనకు పరమాత్మవల్ల యివ్వబడిన యావత్సామర్థ్యము కొరకై ఆయనకు వందనము చేయవలెను. అయితే ఆలాగు వందనముచేయక బ్రహ్మజ్ఞానులు పొందిన వుపకారములన్నింటినిన్ని పొందని వారమనుకొని. తామే ఆ వుపకారములను యిచ్చినట్టు నడుస్తూ వున్నారు. వారు వందనము చేయవలసినట్టయితే యితరులకు కాదు తమకు తామే చేసుకొందురు.

ఇది యెంతో దుర్మార్గత - తన తండ్రి వల్ల పాలించబడిన కూమారుడు తన తండ్రికి వందనము చేయక తనకు తానే తన ప్రాణమును సంపాదించుకొని, పోషించుకొంటిననిన్ని, తన స్వజీవము పుట్టించి దాని క్రమముగా పాలించినవాడననిన్ని చెప్పుకొంటున్నాడు. ఈ బోధ యందు చిక్కియున్న కృతఘ్నుత యీలాటిది.

(ఇ) ఈ జ్ఞానబోధవల్ల దేవునికి యెంతో అవమానము చూడండి.

మా పుణ్యము పాపముతో కలిసి యున్నందున దాని మేము దేవుని మీద వుంచుట ఆయనకు అవమానమై యున్నది అయితే మా పాపములను దేవుని మీద వుంచుట ఆయనను హీనపరిచే అవమానము. దీనికంటే దుర్మార్గత మరి యేది. నిందయున్ను, దూషణయున్ను మరి యేది.

ఎవడైనా అపరాధియై యుండి తన అపరాధమును నిరపరాధియైన తన పొరుగువాని మీద మోపినట్టయితే అది మిక్కిలీ దుష్కార్యమని అందరివల్ల చెప్పబడును. అపరాధియైన వొక కుమారుడు తన అపరాధమును తన తండ్రి మీద మోపి, యీలాగు అతని అవమానపరిచి, దుఃఖపెట్టినట్టయితే ఆ కుమారుడు మిక్కిలి దుర్మార్గుడని మనుష్యులందరివల్ల యెంచబడును గదా అయితే యీ బోధయొక్క అంతమును గురించి మాట్లాడేవాడు యేమి చేసునంటే వాడు తన మనస్సులో దురాపేక్షలను నింపి చెడ్డ భావములను అనుసరించి తన హృదయమందు ఆ పవిత్రత యీవత్తు వుంచుకొని చెడ్డ వాక్యములతో నిండుకొనిన పెదవులవల్లనున్ను సకల అన్యాయముల యందు ప్రవర్తించిన తన శరీరముయొక్క అవయవముల వల్లనున్ను, మిక్కిలీ చెడ్డవాడై యుండును. వాడు తన అపరాధమును వొప్పుకొనక దాని దేవుని మీద మోపుతున్నాడు. మరిన్ని సంపూర్ణమైన పరిశుద్ధత గలవాడై పాపమున్ను, అపవిత్రతయున్ను లేని న్యాయాధిపతియీద వాటిని మోపుతున్నాడు. ఈలాటి దుర్మార్గతకు తగిన

పేరు యొక్కడ వున్నది. దాని మొత్తము లెక్కించే వాడెవడు. ఈ జ్ఞానబోధ యందు రెండంతలు అన్యాయము కలిగియున్నది. మనుష్యుడు అత్యధికముగా నీచుడై యుండి తాను దేవుడంత గొప్పగా వుండ వలెనని కొరుతున్నాడు. మరిన్ని మహోన్నతుడైన దేవుని తనకంటే కిందుపరచ వలెనని ఆలోచిస్తున్నాడు.

(ఈ) ఈ జ్ఞానబోధ దేవునికి యెంత విరోధమైనదో చూడండి.

అది దేవుని ఆరాధించే మనస్సంతా చెరుపుతున్నది. యేలాగంటే - ఈ బోధ ప్రకారము ఆరాధించే వాడున్ను, ఆరాధించబడే వాడున్ను వొకడే, నమస్కరించబడ తగిన వాడున్ను, నమస్కరించే వాడున్ను వొకడే. ఇటువంటి బోధ ప్రపంచమందు ప్రబలమైతే మనుష్యులందరున్ను నాస్తికులై యుందురు. యెందుకంటే తాను తప్ప తనకు ఆరాధించబడ తగిన వాడు మరి యెవడున్ను లేనందున భక్తిగా వుండుట యెందుకు. తాను తప్ప తనకు యజమానుడు యెవడు. తాను తనకు మాత్రమే భయపడవలెను, గాని భయపడే వాడు మరి యెవడు. తనదే గాక మరియెవని ఆజ్ఞయైనా లేనందున చేయతగిన పనులను యికను యేసేవాడెవడు - చేయించే వాడు యెవడు. తన అధికారము గాక మరి యెవని అధికారమున్ను లేనందున నీతిమార్గమందు నడిచే వాడెవడు - నడిపించే వాడెవడు, చూడండి.

ఈ బోధవల్ల దేవుడు తన మహిమను పోగొట్టుకొనును. ఆయన ఆరాధన నిలుచును - ఆయన అధికారము పోవును - మనుష్యులు ఆయనకు విధేయులై చేయవలసిన కార్యములు మానుదురు. నాస్తికత్వముయొక్క బోధలను వ్యాపింప చేసేకొరకై విష్ణుని బౌద్ధావతారము యీ బ్రహ్మజ్ఞానము కంటే వేరొక నాస్తికబోధ కలగ చేయ లేదని నిశ్చయముగా చెప్పబడ వచ్చును. ఇది అంతటా విస్తరించబడి జనులు దాని చొప్పున మాత్రమే నడుచుకొన్నట్టయితే ప్రపంచము అతి శీఘ్రముగా నాశనమై పోవును.

(ఉ)ఈ బోధ మనుష్యుని చెరుపుతున్నదని మేము కనుపరచ బోతున్నాము.

అదేమంటే యీ బోధవల్ల మనుష్యుడు దేవుని కోపమునకు కారణుడై యున్నాడు.

దేవుని అవమానపరిచెను గనుక అయనకు విరోధియైన అతని దండించుట దేవునికి నీతి అవునో కాదో అది యోచన చేసి చూడండి. ఈ పాపము కొరకు దండించ బడక పోతే మరి యే పాపము కొరకు దండించబడును. వొక అపరాధి తీసుకొని రాబడియున్నప్పుడు వాడు రాజు యెదుట నా మీద మోపబడిన తప్పు మహారాజే చేసెనంటే తాను తన మీదికి మరీయెక్కువ దండన వచ్చేటట్టు చేసుకొనును గదా. తన అపరాధపు దండన మాత్రమే గాక తాను తన రాజును అవమానపరిచిన దండన కూడా అనుభవించ వలెను గదా. అవును యీ ప్రకారమే మనుష్యులు నానా విధములుగా దేవుని ఆజ్ఞలను మీరి యున్నప్పుడు తమ పాపములను యెరుక చేసి తాము దండనకు యోగ్యులమని వొప్పుకొనక తమ సృష్టికర్తయున్ను, తమ అధిపతియున్ను, రాజులకు రాజున్ను, ప్రభువులకు ప్రభువుయున్నైన దేవుని మీద తమ పాపములను మోపినట్టయితే అట్టివారు తమ అపరాధములను బహుగా యెక్కువ చేసుకొని తమ గర్వమునున్ను, కృతఘ్నతనున్ను అగుపరుస్తున్నారు. మరిన్ని వారు తమ్మును నాస్తికులుగా తెలియచేసుకొంటున్నారు గనుక, వారు మరీ యెక్కువగా దండనకు తగినవారౌదురు.

దేవునితో సమానులమనే మనుష్యులు తాము దేవుని సంతోష పరుస్తున్నామని యెంచుకొందురు కాబోలును. అయితే దేవుడు యింత ఆయోగ్యమైన సమానత్వము వల్ల సంతోషపడునా. వొక కిరాతుడు వొక మహారాజుతో సమానము చేయబడినట్టయితే ఆ కిరాతుడు సంతోషపడ వచ్చును. అయితే ఆ మహారాజు కోపపడును గదా. వొక చండాలుడు వొక బ్రాహ్మణునితో సమానము చేయబడినట్టయితే ఆ ఛండాలుడు

సంతోషపడవచ్చును. అయితే ఆ బ్రాహ్మణుడు కోపము తెచ్చుకొనును గదా. మరిన్ని మాన భంగము చేయబడి నిండా పాపముగల మనుష్యుడు మహోన్నతుడగు పరిశుద్ధ దేవునితో సమానము చేయబడినట్టయితే వాడు ఆ సమానత్వమువల్ల సంతోషపడ వచ్చును అయితే పరిశుద్ధ దేవుడు న్యాయముగా కోపము తెచ్చుకొనును గదా. ఆయన తన మహిమను సృష్టింబడిన వాటిలో దేనికిన్ని యివ్వడు గనుక నీచ పాపియైన మనుష్యునికి యిచ్చునా ఇంత దుర్మార్గపు ఆలోచనలవల్ల మనుష్యుల మీదికి దేవుని కోపము వచ్చును. ఆ కోపము వారు అనుభవించ వలసినది.

దీని గురించి బ్రహ్మజ్ఞానిని యెవరితో సమానము చేతుము. వొకడు తనను వురివేయుటకు సమీపించి యున్నప్పుడు తాను స్వతంత్రుడై యావదధికారము గలవాడై ఆ యధికారమందు ఆనందిస్తున్నానని స్వప్నము కనిన వొక అపరాధి వలె వున్నాడు. అయితే వాడు మేల్కొనినప్పుడు తన యెదుట దారోగానున్న తన్ను కట్టి పెట్టి వురిమాను యొద్దికి తీసుకొని వెళ్లటకు తాళ్లతో సిద్ధమైయున్న బంట్రౌతులనున్ను చూచును. చూడగానే రాత్రి యొక్క వాని భ్రమ తప్పిపోవును.

ఈ ప్రకారమే బ్రహ్మజ్ఞాని నేనే దేవుడను నాకు పాపములేదు, నా పనులన్నీ దేవుని పనులే అని యిప్పుడు చెప్పును. అయితే మరణమైన తరువాత న్యాయపు తీర్పుయందు అగుపడవలెను. దేవుడు వీని దేవదూషణను గూర్చిన్ని, గర్వమును గూర్చిన్ని విచారించేటప్పుడు వీని భ్రమయావత్తు మాయగా వుండును. అప్పుడు వాడు మనుష్యాత్మయున్ను, పరమాత్మయున్ను వేరై యున్నవనిన్ని, ప్రతిమనుష్యుడూ తన స్వపాపము యొక్క భారమును మోయవలెననిన్ని, మిక్కిలీ భయంకరమైన దండన కొరకు పట్టుబడిన వాడై తెలుసుకొనును.

చదివే వారలారా మేము యిప్పుడు యీ బోధ వల్లనైన అబద్ధము నున్ను, దుర్గుణమునున్ను, భక్తి హీనతనున్ను, మనుష్యులకు నాశకరమైన

దానిన్ని అగుపరిచితిమి. ఇకను నిజమైనదిన్ని, దేవుని భక్తి యైనదిన్ని, జ్ఞానముగలదిన్ని, జీవమిచ్చేదిన్నైన బోధ మీతో మేము చెప్పుదుము.

## దేవుని గురించినది - బాగా తెలుసుకొనండి

1. దేవుడు ఆత్మయై యుండి భాగములుగా వుండడు. ఆయన ఆకారమైన పదార్థమువలె విభాగించబడనేరడు. ఆయన సంపూర్ణుడు గనుక ఆయన యందు భాగములు వుండవు. బ్రహ్మాజ్ఞానులు పరమాత్మ విభాగించబడ తగి యున్నట్టుగా చెప్పుతున్నారు. మరిన్ని అబద్ధమైన వుదాహరణములు కల్పించి వారు తమకు తామే మోసపోతున్నారు. వారి దృష్టాంతమేమంటే వెయ్యిపాత్రలలో వొకనది నీళ్లు పోసినట్టయితే, వొక పాత్రలోని నీళ్లకున్ను, మరియొక పాత్రలోని నీళ్లకున్ను, ఆ నది యొక్క నీళ్లకున్ను యేలాగు భేదములేదో అలాగే ఆత్మల సమూహములు నిత్యాత్మ నుంచి బయలుదేరి శరీరములయందు నివసించి యున్నవి గనుక, పరమాత్మనున్ను వీటికిన్ని భేదము లేదని చెప్పుతున్నారు. వొక నది నీళ్లు చాలా వేలకొలది పాత్రలను నింపవచ్చును. అలాగే పరమాత్మయున్ను చాలా వేలకొలది శరీరముల యందు నివాసము చేయవచ్చును. ఆ శరీరముల అన్నిటిలో వున్న ఆత్మ, యేకాత్మయై యున్నదని అంటారు. అయితే యీ వుదాహరణము సరిపడదు. దానివల్ల స్థాపించుటకు ప్రయత్నము చేయబడిన బోధ అబద్ధమై యున్నది. యేలాగంటే ఆకారమునకున్ను, నిరాకారమునకున్ను పోలికేలేదు. వొక దానికి వొకటి సరిపడనటువంటి వుదాహరణము చెప్పకూడదు. చూడండి, వొక ఆకారమైనా పదార్థము విభాగించబడుటకు తగియున్నది. వొక భాగము యిక్కడనున్ను మరియొక భాగము అక్కడనున్ను వుండ వచ్చును. చాలా వేల కొలది భాగములు, చాలా వేల కొల్దది స్థలముల యందు చేరి యుండవచ్చును. సముద్రమంతా బిందువులుగా విభాగించబడి ఆ బిందువులన్ని వొక దానికి వొకటి వేరై యుండ వచ్చును. మరిన్ని బిందువులన్ని కూడినట్టయితే సముద్రమని యెంచ వచ్చును. అయితే

పరమాత్మ యీ ప్రకారము కాదు. అందులో భాగములు వుండవు. అది విభాగించబడ తగిన వస్తువు కాదు. ప్రత్యేకించబడ తగిన వస్తువున్ను కాదు. దేవ స్వభావము విభజింప కూడనిదై యున్నది.

మనుష్యుడు దేవుని స్వభామును గురించి తర్కము చేసేటప్పుడు ఆకారమైన వస్తువుకు సంబంధమైన దృష్టాంతము తెచ్చి చూపక, నిరాకారమైన మనుష్యాత్మకు సంబంధమైన దృష్టాంతము తెచ్చి చూపినట్టయితే, మనుష్యాత్మ విభాగించబడ కూడనిదై యున్నది. యేలాగంటే ప్రతి మనుష్యునికిన్ని నేనే అన్నటువంటి విభాగించబడ కూడని వొక ఆత్మ కలిగియున్నదే. ఆలాగైతే పరమాత్మయైన దేవుడు విభాగించబడకూడునని వారు యేలాగు చెప్పుదురు. ఆకారమైన మనుష్య శరీరము కోయబడి వొక భాగము యిచ్చోటనున్ను, మరి యొక భాగము ఆచ్చోటనున్ను వుంచబడవచ్చును. అయితే అతని ఆత్మవొక భాగము యిక్కడనున్ను, మరి యొక బాగము అక్కడనున్ను యీ ప్రకారము వుంచుటకు భాగములుగా విభాగించబడ కూడదు. ఈలాగైతే పరమాత్మ మరి యెంత అధికముగా విభాగించబడ కూడదని చెప్పవచ్చును. అయితే బ్రహ్మజ్ఞానులు యీలాగున తర్కము చేయరు. ఆకారము వల్ల నిరాకారము వివరించుటకున్ను, సృష్టి రీతులవల్ల సృష్టికర్త విషయమై వివరించుటకున్ను వారు ప్రయత్న పడి తర్కిస్తున్నారు. అందువల్ల వారు తప్పిపోతున్నారు.

2. దేవుడు విభాగించబడ కూడని వాడై యున్నందున ఆయన స్వభావమువల్ల సకల వస్తువులకు భేదముగా వున్నాడు. ఆయన సృష్టించిన వాటి యన్నిటిలో నున్ను వున్నప్పటికీ ఆయన స్వభావము ఆకారమైన వస్తువులతో నైనా, మనుష్యాత్మలతోనైనా, మరి దేనితోనైనా మిశ్రమము చేయబడ నేరదు. సృష్టికర్త తాను సృష్టించిన వాటితో కలపబడక యెల్లప్పుడున్ను తన్ను అపరిమితముగా భేదపరుచుకొంటున్నాడు. ఆయన మహిమగల స్వభావము తనకు తానే సమస్తమునకు నిరంతరమున్ను ప్రత్యేకముగా వుండవలెను.

3. సృష్టికర్తయై యున్నటువంటిన్ని, సకలోత్తమమైన లక్షణములచేత సంపూర్ణుడై యున్నటువంటిన్ని, తన సకల జీవులకు వుపకారము చేసేటటువంటిన్ని, వాటిని వుద్ధరించే టటువంటిన్ని దేవుడు తెలివిగల సమస్త జీవులవల్ల వందనమున్ను, ఆరాధనయున్ను పొందుటకు యోగ్యుడై యున్నాడు. జీవము పుచ్చుకొని జీవము యిచ్చేటటువంటిన్ని, ఫలమిచ్చి దండించేటటువంటిన్ని, మన క్రియల చొప్పున మనకు సుఖమైనా దుఃఖమైనా నియమించేటటువంటిన్ని దేవునికే భయపడవలెను. మరి యెవనికిన్ని భయపడతగదు. ఆయన పరిశుద్ధ చిత్తమును యీడేర్చుట యున్ను, ఆయన నీతిగల కోపమును తప్పించుకొనుటయున్ను మన మీద పడిన ముఖ్యమైన భారమై యున్నది. మరిన్ని యిందువల్ల మనకు నిత్య ప్రయోజనమవును.

దేవుని గురించి యింతక్లుప్తముగా విని యిప్పుడు మనుష్యుని గురించి నిజమైన బోధ తెలుసుకొనవలెను

1. మనుషయుడు శరీరమున్ను ఆత్మయున్నై యున్నాడు. ప్రతి మనుష్యుని శరీరమున్ను మరియొకని శరీరమునకు భేదముగా వున్నది. ప్రతి మనుష్యుని ఆత్మయున్ను మరియొకని ఆత్మకు భేదముగా వున్నది. అతని ఆత్మయున్ను, శరీరమున్ను దేవుని వల్ల సృష్టించబడివి. మరిన్ని అతని శరీరము దేవుని కంటే యేలాగు భేదముగా వున్నదో అతని ఆత్మయున్ను అలాగే భేదముగా వున్నది. నేను నీవు అనే తెలివి ప్రతి మనుష్యునికిన్ని వుండుటవల్ల తనమనస్సాక్షి ప్రకారము యితరమనుష్యులందరికిన్ని, తనకున్ను భేదమున్నదని యెల్లప్పుడు తెలుసుకొంటున్నాడు. ఈలాగు అతనికిన్ని, పరులకందరికిన్ని భేదము వున్నందున అతనికిన్ని దేవునికిన్ని మరియెంతో అధికముగా భేద ముండును. ఈ భేదము యెప్పుడున్ను మానదు. అతని శరీరము భూమి యొక్క మంటితో మిశ్రమమైపోయినా ఆ భేదము యెప్పుడున్ను మాననేరదు. అతని సంగతులు మార్చబడ వచ్చును గాని, ఆ భేదము

యెప్పుడనున్ను మార్చబడనేరదు. అతడు దాన్ని పోగొట్టుకొనుటకు ఆపేక్షించవచ్చును గాని యెప్పుడున్ను అదిపోగొట్టబడదు - పోగొట్టుకొన లేదు. అతని స్వభావము సంపూర్ణముగా నాశనము చేయబడితేనే గాని దాని పోగొట్టుకొన లేదు.

2. ప్రతి మనుష్యుడున్ను శరీరాత్మలను యిచ్చిన దేవుని వశమందు వున్నాడు. దేవుని దయనున్ను, వుపకారమునున్ను, కనికరమున్ను అంగీకరించేవాడై యున్నాడు. దేవుని ఆజ్ఞలకు విధేయుడై నడుచుట వాని మీద పడిన భారమై యున్నది. వాటి పైని తన అధికారము లేదు. దేవుని అధికారములో వున్నాడు. వాడు తన తలంపులున్ను, మాటలున్ను, క్రియలున్ను యీ మొదలైన వాటిని గురించిన లెక్క వొక్కడైన దేవునికి అప్పగించి, ఆ దేవుని వల్ల సరియైన తీర్పు పొందవలెను. వాడు తన కొరకే గాని మరి యొకకని కొరకు వుత్తరమిచ్చుటకు ఆడగబడదు మరియొకని పాపము అతనిమీద మోపబడదు. మరి యొకని పుణ్యము అతనికి యెంచబడదు. అయితే ప్రతి మనుష్యుడున్ను తన భారము తానే మోసుకొనును.

ఈ లోకము వొక పొలమువంటిది. మనుష్యులు విత్తేవారు, వారి క్రియలు విత్తనములు. ఈ జీవితకాలము విత్తేకాలము. మరణము తరువాత కోసే కాలము వచ్చును. నీతి సత్యములనే మంచి విత్తనము విత్తేవారు సంతోషభరితమైన ఫలముల కోతురు. దుర్నీతిన్ని, ఆసత్యమున్ను అనే చెడ్డ విత్తనములు విత్తేవారు దుఃఖభరితమైన ఫలములు కోతురు. ఈ జీవము పోయినప్పుడు పరకాయ ప్రవేశములేదు. ఆత్మ మరి యొక రూపమందు ప్రవేశించదు. ఈ జీవిత కాలమందుకలిగిన సుఖదుః ఖముల ప్రకారము నిత్యస్థితియందు నిర్ణయించబడదు. సకల మనుష్యులు యిప్పుడు చేసిన క్రియల ప్రకారము వారి మరణదినము మొదలుకొని శాశ్వతకాల పర్యంతము ఆ క్రియల ఫలములు అనుభవించవలెను. ఇదే నిజమైన బోధ.

కాబట్టి చదివేవారలారా మీరు పాప పరిహారమును పొందవలెను. లేకుంటే మారు నిత్యనాశనము పొందదురు. అయితే పాప పరిహారమును పొందుటకు బ్రహ్మజ్ఞానము విడిచి, పరమాత్మయైన దేవుని నిజస్వభావ ప్రకారము పుణ్యాత్మలతో ఆయనను ఆరాధించుటయున్ను, సేవించుట యున్ను చాలదు. ఈలాగున చేయడము మంచి దైనప్పటికిన్ని దీనివల్లనే పాపపరిహారము కానేరదు. ఈలాగున నడుచుట తన జీవిత కాలమంతట లో మనుష్యుని మీద పడిన భారమైయున్నది. వాని తలంపులన్నిన్ని, మాటలన్నిన్ని, క్రియలన్నిన్ని మంచివై యుండవలెను. వానికి పాపముగల వొక్క తలంపు వుంటే అది వాని పుణ్యమంతా చెరువుతున్నది. అందుచేత దేవుని ఆజ్ఞాప్రమాణమును మీరి యున్నాడు. దాని శాపము వాని మీదికి రావలెను. గనుక సకల మనుష్యులు పాపులై దేవుని శాపమునకు పాత్రులైయున్నారు. వారిలో వొకడై నా నిజముగల పుణ్యవంతుడు లేడు. ఈలాగుండుట వల్ల తమవల్ల తామే పాపపరిహారము పొందనేరరు. వారి కర్తయున్ను, న్యాయాధిపతియున్నైన దేవుడు మాత్రము పాపముల నుంచి వారిని విడిపించగలడు. అయితే మరి యెవరి వల్లనైనా కానేరదు. మరిన్ని దేవుడు నీతియందున్ను పరిశుద్ధత యందున్ను అపరిమితుడై యున్నందున మనుష్యుల పాపములను వూరికె పరిహరించడు. తన నీతిన్ని, తన పరిశుద్ధతనున్ను యెంతమాత్రము ఫుల్లంఘించక తన మహాకృపవల్ల మిక్కిలీ జ్ఞానముగల వుపాయము కల్పించి దాని ప్రకారమే మనుష్యుల పాపములను పరిహరించును. యెవరైనా యీ వుపాయమును తెలుసుకొని దాని ప్రకారము తమ పాపముల పరిహారము వేడుకొన్నట్టయితే అది వారికి కలుగును. గాని మరి యేవిధము వల్లనైనా కలుగ నేరదు.

ఈ వుపాయము యేమంటే బైబిలనే సత్యవేద మందు మనుష్యులకు తెలుపబడ్డ బోధ ప్రకారము యేక దేవత్వమందు త్రిత్వము వున్నది. అనగా పితృ, పుత్ర, పరిశుద్ధాత్మలు అనేవారు. ఈ దేవత్రయము,

యీత్రైయైక దేవుడుతన్ను గురించి ఈ బోధమనకు తెలియ చేసుటవల్ల మనము నమ్మవలెను. ఇంత మర్మముగల బోధను సంపూర్ణముగా గ్రహించుటకు మన మితిగల జ్ఞానము చాలదు. అయితే అది మన జ్ఞానమునకు విరోధముగా వుండలేదు. చూడండి, మనుష్యులకు ఆత్మ, ప్రాణ, శరీరములు వున్నవి. ఈ మూడు వొకడే మనుష్యుడై యున్నలాగున, పితృ, పుత్ర, పరిశుద్ధాత్మలనే వారు వొక్కదేవుడయే వుండవచ్చును. ఈ బోధ ప్రకారముగా తండ్రియైన దేవుడు తన కూమారుడైన యేసు క్రీస్తును మనకు రక్షకుడై యుండుటకు నియమించెను. ఈ దేవరక్షకుడు పాపులైన మనుష్యులను రక్షించుటకు నరావతారము యెత్తి మనుష్యులకు ప్రతిగా దేవుని ఆజ్ఞాప్రమాణము యొక్క శాపము అనుభవించేటందుకు మిక్కిలీ శ్రమపడి తుదకు తన ప్రాణము బలిగా అర్పించెను. ఆ బలివల్లనే తగిన ప్రాయశ్చిత్తమాయెను. దేవుడు తన నీతికిన్ని, తన పరిశుద్ధతకున్ను హానిరాకుండా యిప్పుడు పాపులను అంగీకరించి, వారి పాపములన్నిటినిన్ని దయతో క్షమించును. యేసుక్రీస్తు తనయొక్క పుణ్యమువల్ల పాపులమైన మనలను నీతిమంతుల మని తీర్చుచున్నాడు. మరిన్ని మనుష్యుడు యేమాత్రమైనా తనపాపములను తాను పరిహరించ కొనజాలడని తెలుసుకొని యీ దివ్యరక్షకుని యందు విశ్వాసము వుంచినట్టయితే దేవుని మహాకృప వల్ల పాపపరిహారము సంపూర్తిగా వానికి కలిగి పరిశుద్ధాత్మ యొక్క బలము వల్ల కొత్తగుణము లభించును. ఈ కొత్తగుణము పరిశుద్ధతయొక్క సారమైయున్నది. సమస్తనీతికిన్ని విత్తనమై యున్నది. ఈ కొత్తగుణము క్రమక్రమముగా ప్రబలమై తుదకు సంపూర్ణమౌను. ఈ ప్రకారముగా యేసుక్రీస్తు యందు నమ్మికవుంచిన వారు, పరిశుద్ధులున్ను నీతిమంతులున్ను అవుదురు. అందువల్ల దేవుడు వారిని తన పిల్లలుగా అంగీకరించి వారికి కావలసిన వుపకారములను, వారు చనిపోయినప్పుడు వారి ఆత్మలను తన యొద్దచేర్చి సంపూర్ణవమైన సౌఖ్యము ఆయాత్మలకు యిచ్చును. మరిన్ని అంత్యన్యాయపుతీర్పు దినమందు వారి శరీరములను లేపి ఆ శరీరములనున్ను ఆయాత్మలనున్ను కూర్చి వారికి పరలోకమందు సంపూర్ణమైన భాగ్యము నిరంతరమున్ను అనుగ్రహించును.

కాబట్టి చదివేవారాలారా యీ దివ్యరక్షకుని యందు విశ్వాస ముంచండీ. దేవుడు అతి ప్రేమవల్ల యీ తన ప్రియకుమారుని మీ రక్షకునిగా నియమించెను. మరియెవరివల్లనైనా మీకు రక్షణ యెప్పటికిన్ని కలగ నేరదు. ఈ మహాకృపగల రక్షకుడు తన తండ్రి యొక్క చిత్త ప్రకారముగానున్ను, తన చిత్తప్రకారముగానున్ను, తన్ను తగ్గించుకొని చాలా కష్టపడి మీరు నిత్యజీవమును అనుభవించేకొరకు తన ప్రాణమును దేవునికి బలిగా అర్పించెను.

ఇందువల్ల మీరు ఈ రక్షకుని మిక్కిలీ కృతజ్ఞతతో అంగీకరించ వలెను. లేకుంటే మీరు దేవునిన్ని, దేవుని యొక్క మహా ప్రేమనున్ను, యింక మీ ఆత్మల రక్షణనున్ను తిరస్కరిస్తున్నారు. ఈలాగు నడుచుకొని చనిపోయినట్టయితే నరకబాధను యేలాగు తప్పించుకొన వచ్చును, అది కానేరదు.